# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు.**

2. **అరసవల్లి దేవస్థానం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 55 కోట్ల 74 లక్షల రూపాయలను మంజూరు చేసిందని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**

3. **ఆరోగ్యవంతమైన పౌరులతోనే దేశం అభివృద్ధి చెందుతుందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

==========================

విజయవాడలో జరిగే 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం లబ్దిదారులకు ఇళ్ల స్థలాలపై శాశ్వత హక్కుల పట్టాలు పంపిణీ చేస్తారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాలతో పాటు గన్నవరం, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, తిరువూరు నియోజకవర్గాలకు చెందిన 26 వేల 401 లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను ముఖ్యమంత్రి అందజేస్తారు.

--------------------------

గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెర్మిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన పౌరులతోనే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. అంగన్వాడీల ద్వారా గుడ్లు, పౌష్టికాహారం అందించడంతో పాటు గర్భిణీలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు శ్రీనివాస వర్మ తెలిపారు.

--------------------------

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 55 కోట్ల 74 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు

రామ్మోహన్ నాయుడు తెలిపారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద ఈ నిధులు మంజూరయ్యాయని ఆయన ఒక వీడియో సందేశంలో వెల్లడించారు. అరసవల్లి కేవలం ఆలయం మాత్రమే కాదని.. శ్రీకాకుళం ఆధ్యాత్మికత, సంస్కృతి, చరిత్రకు ప్రతీక అని పేర్కొన్నారు. మంజూరైన నిధులతో భక్తులకు మెరుగైన మౌలిక వసతులు, పర్యాటక సౌకర్యాలు, కనెక్టివిటీతో పాటు అరసవల్లి సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నామని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---

'సేవాభావం-నాగరిక్ దేవోభవ' స్ఫూర్తితో దేశ నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వాములు కావాలని కేపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్‌పర్సన్ ఎస్. రాధా చౌహాన్ అన్నారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో మిషన్ కర్మయోగి కార్యక్రమం కింద నిర్వహిస్తున్న రెండు రోజుల ప్రాంతీయ 'సాధన శృంఖల' కార్యశాలలో రెండో రోజు ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధా చౌహాన్ మాట్లాడుతూ.. మిషన్ కర్మయోగి లక్ష్యం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం మాత్రమే కాదని ప్రతి ఉద్యోగిని నిజమైన 'కర్మయోగి'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

---

ఆసియా క్రీడలు -2026లో భారత మహిళల ఆర్చరీ జట్టు స్వర్ణ పతకం సాధించడంపై రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్‌లో చైనాను 238-234తో ఓడించి స్వర్ణ పతకం సాధించిన భారత మహిళల ఆర్చరీ జట్టుకు మంత్రి ఈరోజు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. భారత క్రీడాకారిణుల అద్భుత ప్రదర్శన దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్ పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రానికి చెందిన ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై వరుస విజయాలతో జ్యోతి సురేఖ భారత క్రీడా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారని మంత్రి కొనియాడారు.

---

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా వీధి వ్యాపారుల కోసం అమలు చేస్తున్న ప్రధానమంత్రి స్వనిధి పథకం గురించి ఈరోజు తెలుసుకుందాం.

దేశవ్యాప్తంగా వీధి వ్యాపారుల జీవనోపాధిని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా ఎంతో మంది లబ్ధి పొందుతున్నారు. ప్రధాన్ మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధిగా పిలిచే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2020 జూన్ ఒకటో తేదీన ప్రారంభించింది. వీధి వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా విడతల వారీగా చిన్న రుణాలు అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రుణాలను సక్రమంగా, నిర్ణీత సమయంలో చెల్లించే వారికి వడ్డీ రాయితీ కూడా అందిస్తున్నారు.వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందించడంతో పాటు.. వారి జీవనోపాధిని పునరుద్ధరించడంలో ప్రధానమంత్రి స్వనిధి

పథకం కీలకంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక సందర్భంలో తెలియజేస్తూ..

వాయిస్ ..25.. సెకన్లు

---

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఒంగోలు ఉత్సవం ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఒంగోలు నగరంలోని మినీ స్టేడియంలో ప్రారంభమైన ఈ వేడుకలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆర్ట్ గ్యాలరీ, పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ..

వాయిస్ ..30.. సెకన్లు

---

రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకం సాధించిన క్రీడాకారులకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంత్రి ఈరోజు స్వాగతం పలికారు. పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో 76 కిలోల సీనియర్ మహిళల విభాగంలో దేశం తరపున రజత పతకం సాధించిన ఎస్.చంద్రకళను అభినందించారు. విజయవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

---

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామీణ మండలంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న కోటి 27 లక్షల రూపాయల విలువైన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అలాగే 10 లక్షల రూపాయలతో పునర్నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. చిన్నారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో విద్య, పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

---

తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో ఆర్థిక ప్రాంత సదస్సు ఈరోజు ప్రారంభమైంది. తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల ఆర్థిక వృద్ధి అవకాశాలపై తిరుపతి ఆర్థిక ప్రాంత ముఖ్యకార్యనిర్వహణాధికారి సీఈఓ ముకేష్ కుమార్ మీనా ఈ సదస్సులో చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. 2047 నాటికి తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని 80 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రాంతీయ వనరులు, ప్రత్యేకతలను సద్వినియోగం చేసుకుంటే తిరుపతి ప్రాంతంలో అపారమైన ఆర్థిక అవకాశాలు ఉన్నాయని అన్నారు. పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం, లాజిస్టిక్స్, సేవల రంగాల్లో

సమన్వయంతో అభివృద్ధి సాధించేలా ప్రణాళికను రూపొందించామని తెలిపారు.

--------------------------

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పార్వతీపురంలో జిల్లా స్థాయి రెడ్ రన్ మారథాన్‌ను ఈరోజు  నిర్వహించారు. పార్వతీపురంమన్యం  జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.

=======================